# నీకు నేనున్నాను

"కార్తీక్! అరుణ్‌తో నా మారేజ్ సెటిలయింది. అరుణ్ పెళ్ళికి చాలా తొందర పడుతున్నాడు. నెలాఖరుకు ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు." చాలా ఉత్సాహంగా, వస్తూనే అన్నది అనుపమ. ఆమె వదనం అనిర్వచనీయమైన ఆనందంతో వెలిగిపోతోంది.

కానీ కార్తీక్ వదనం వెలవెల బోవడం ఆమె గమనించనేలేదు, "అరుణ్‌తో నీకు పెళ్ళా.... అయితే నేనే పొరపాటు పడ్డానన్న మాట" స్వగతంగా అనుకోబోయి పైకే అన్నాడు. "ఏమిటి, కార్తీక్!- పొరపాటంటున్నావేమిటీ?" అంది అనుపమ. "ఏం లేదు" అని కార్తీక్ దాటెయ్యబోయినా అనుపమ చెప్పాల్సిందేనని పట్టుబట్టింది. "ఏం లేదు అనూ! నేనే నిన్ను అపార్థం చేసుకున్నాను, నీ స్నేహాన్ని మరోలా అర్థం చేసుకున్నాను. అంతకన్నా ఏమీ లేదు." ఆ విషయాన్ని ఎంత తేలిగ్గా తీసుకుందామని ప్రయత్నించినా బాధా వీచికలు అతని మొహం మీద తారాడుతున్నై. అతని మాటలకు నివ్వెరపోయిన అనుపమకు అతని కళ్ళల్లోని ఇన్నాళ్ళ ఆరాధన అర్థమైంది.

ఒక నిమిషం ఇద్దరి మధ్య మౌనం రాజ్యం చేసింది. "నాకు తెలియకుండా నీలో ఆశలు కల్పించి ఉంటే క్షమించు కార్తీక్!" అన్నది మెల్లిగా. అవన్నీ మరచిపో, అనూ! శుభవార్త చెప్పావు-అదే నీ పెళ్లి

వార్త-నీకు తీపి తినిపించాల్సిందే. ఉండు, ఇప్పుడే నీ కిష్టమైన జీడిపప్పు మిఠాయి తీసుకొస్తాను" అంటూ అనుపమ మాటకు కూడా ఎదురు చూడ కుండా బయటికి వెళ్ళాడు కార్తీక్. అనుపమకంతా చిత్రంగా, ఆశ్చర్యంగా ఉంది. కార్తీక్ మనస్సు అర్థం చేసుకోవడం చాలా కష్టం అనుకుంది నిట్టూరుస్తూ.

* * *

"పెళ్ళికాకముందే ఈ తిరగడం నాకేం నచ్చలేదు." అనుపమ తల్లి లక్ష్మి అనుపమను హెచ్చరించింది. శ్రద్ధగా చేసుకున్న అలంకర ణలో అసలే పసిమి వన్నెలో మెరిసిపోయే అనుపమ మరింత మెరిసిపో తోంది. ఒక్కొక్కసారి ఆవిడే దృష్టి తిప్పుకోలేక "కూతురికి నేనే దిష్టి పెడుతున్నానా. అని ఉలిక్కి పడి దృష్టి తిప్పుకుంటుంది.

పెళ్ళికింకా పదిహేను రోజులు గడువుంది. పెళ్ళికి చాలా మందిని పిలవడం, పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడంతో ఇంట్లో అందరూ చాలా బిజీగా ఉన్నారు. శుభలేఖలు కూడా చాలా ముందుగానే వేయించడం జరిగింది.

కార్తీక్ గుర్తొచ్చిన సందర్భంలో తప్ప అనుపమ మనసు పురి విప్పిన నెమలిలా ఉంది. కాబోయే జీవిత భాగస్వామి అరుణ్‌కుమార్ అనుపమకు తగిన జంట. చూసేవాళ్లు అసూయ పడేంత ముచ్చటగా ఉంటారిద్దరూ. ఇంతవరకూ బాగానే ఉంది గానీ ఎంత ప్రేమ వివాహ మైనా పెళ్ళికి ముందే మరీ విచ్చలవిడిగా స్కూటర్ల మీద తిరగడం తల్లి లక్ష్మికి నచ్చలేదు. "హద్దులో ఉంటేనే అందం" అన్నది ఆమె సిద్ధాం

తం. తండ్రి రాఘవయ్యగారు అనుపమకు కావలసినంత స్వేచ్ఛ నిచ్చారు కూతురు ప్రవర్తన పట్ల నమ్మకం, ఆమె ఏ పనిచేసినా సరైనదే అన్న విశ్వాసం ఆయనకున్నై.

"అమ్మా! పెళ్ళింకా పది హేనురోజులే. ఇటుసూర్యుడటు పొడిచినా మా పెళ్లి ఆగదు. ఇంక నీకు భయమెందుకు?" చాలా తేలిగ్గా అంది అనుపమ.

"అవునమ్మా! నేనూ అదే అంటున్నా. పది హేనురోజులయ్యాక నీ ఇష్టం-అల్లుడిష్టం...." అంటూ ఏదో చెప్పబోతుండగా రాఘవయ్య గారొచ్చారు. "ఏమిటి అమ్మాయిని నిలబెట్టి ఏదో ఉపన్యాసమిస్తున్నావ్?" అంటూ.

"చూడు నాన్నా! అరుణ్‌తో నన్ను తిరగొద్దంటోంది." తల్లిమీద కంప్లైయింట్ చేసింది అనుపమ.

"మీ అమ్మకింకా పూర్వకాలపు వాసనలు పోలేదులే తల్లీ! నువ్వెళ్లు అరుణ్ వెయిట్ చేస్తున్నాడు." అప్యాయంగా కూతుర్ని చూస్తూ అన్నాడు రాఘవయ్య.

"థ్యాంక్యూ డాడీ!" అంటూ దూసుకుపోయింది అనుపమ.

"మీరు మరీ దాన్ని నెత్తికెక్కించుకుంటున్నారు" కసురుకుంది లక్ష్మి.

"దాని మనసు బాధపెట్టడమెందుకు? చిన్న పిల్ల సరదాగా తిరగాలనుకోవడంలో తప్పేముంది?"

"మనకు తప్పులేదండీ-కానీ చూసే వాళ్ళేమనుకుంటారు?"

"చూసేవాళ్ళు ఏమున్నా లేకున్నా లక్షాతొంభై అనుకుంటారు-అన్నీ పట్టించుకుంటే ఇక మనం బతికినట్లే! సర్లే కాస్త కాఫీ అయినా ఇస్తావా? పెళ్ళి పనులు చేయాల్సినవింకా చాలా ఉన్నై. త్వరగా బయటికి వెళ్ళాలి" అంటూ మాట మార్చేశాడు రాఘవయ్య.

* * *

ముహూర్తమింక వారం రోజుల్లోకి వచ్చింది. చాలావరకు పెళ్లి పనులు, పిలుపులు పూర్తయి ఇద్దరికి కావలసిన బట్టలు ఎవరికి ఏ రంగు నచ్చుతుందో పరస్పరం చర్చించుకుని తీసుకున్నారు.

ఆ వేళ ఉదయం నుంచి షాపింగ్ చేశారిద్దరూకలసి. అనుపమ చాలా అలసిపోయింది.

"అబ్బ! చాలా అలసటగా ఉంది. అరుణ్! కాసేపు విశ్రాంతిగా పడుకోవాలనుంది"! అంది అనుపమ బడలికగా.

"ఒంటరిగానా, జంటగానా?" చిలిపిగా అడిగాడు అరుణ్.

అనుపమ సిగ్గుపడింది. "ఏమిటి అరుణ్ మరీ అట్లా మాట్లాడుతావు?"

"అంత సిగ్గెందుకో - అయినా నిన్ను పూర్తిగా సొంతం చేసుకోడానికింకెంత - సరిగ్గా వారం రోజులు...." అంటూనే అనుపమనుఆర్తిగా దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు అరుణ్.

ఏదో అనుభూతి. ఏవో తెలియని తన్మయత్వం! "అనుపమా! నీకు దూరంగా నేనుండలేక పోతున్నాను. గడవాల్సినవి ఏడు రోజులా ఏడు యుగాలా అను" ఆమె చెవిలో గుసగుసగా అన్నాడు అరుణ్.

"అవును అరుణ్! నాకూ అట్లాగే అనిపిస్తోంది" అతని పరిష్వంగ సుఖంలో అనుపమ మరింత సోలిపోతోంది.

ఎవరో వస్తున్న అలికిడికి అతని నుంచి దూరంగా జరిగింది అనుపమ.

"అనుపమా! పిక్చర్‌కి వెళ్దాం తొందరగా తయారవు"! ఆజ్ఞాపిస్తూ అన్నాడు అరుణ్.

"నాకీవేళ అలసటగా ఉంది అరుణ్! రేపువెళ్దాం" అంది అనుపమ

"ఏమిటోయ్ అలసట అంటావ్? అలసట గిలసట అన్నీ నేనెగర గొట్టేస్తాను. వెళ్ళ తయారయిరా" అన్నాడు మళ్ళ అధికార స్వరంతో, అనుపమ ఏదో అనబోయింది కానీ అరుణ్ వినలేదు.

తల్లి సినిమాకు వెళ్ళొద్దన్నది, కానీ కాబోయే అల్లుడు రమ్మన్నాడంటే వద్దంటే ఏం కోపమొస్తుందో....

వెళ్ళింది ఇంగ్లీషు సినిమా. బాల్కనీలో కూర్చున్నారిద్దరూ. అచ్చమైన సెక్స్ పిక్చరది. అందులో కౌగిలింతలు, ముద్దులూ. పక్కనున్న అరుణ్‌తో చూడటానికి చాలా సిగ్గుగా ఉంది అనుపమకు. "ఇటువంటి

పిక్చర్‌కి తీసుకొచ్చావేంటి?" మెల్లగా అంది. ఆ సినిమాలో సన్నివేశానికి అనుపమకి మనసూ, శరీరం లయ తప్పుతున్నాయి. అంతకంటే అరుణ్ ఉద్రేకంలో అనుపమ నడుం చుట్టూ చెయ్యేసి, "ఐ వాంట్ యూ అనూ" అంటున్నాడు. అతని స్పర్శకి ఆమెకూ అదుపు తప్పుతున్నది. అతని నరాల్లో వేడి- అనుపమకు ఆ అనుభూతి బాగున్నా భయంగా ఉంది. "అరుణ్! ఎవరైనా చూస్తే బాగుండదు. మూడుముళ్ళూ పడే వరకూ ఆగు" అంది సర్దుకు కూర్చుంటూ.

"సినిమా పూర్తైంది. అరుణ్ ఒళ్ళంతా వేడెక్కింది. కళ్ళు ఎర్ర బడినై. అనుపమను సొంతంచేసుకోవాలన్న కాంక్ష అతని అణువణువూ నిండిపోయింది. హాల్లోంచి బయటికి వస్తుంటే అరుణ్ అన్నాడు మెల్లగా- "అనుపమా! ఇక్కడి హోటల్లో ఒక గంట గడిపి వెళ్ళిపోదాం." అనుపమకు ఒక క్షణం అతడంటున్నదేమిటో అర్థం కాలేదు. అర్థమైన తరువాత గుండెలు వేగంగా కొట్టుకునై. కాళ్ళల్లో సన్నగా వణుకు....

"ఇప్పుడొద్దు అరుణ్! ఇంటికి వెళ్ళిపోదాం. మా అమ్మ ఎదురు చూస్తూ ఉంటుంది" అంది.

"ప్లీజ్ అనూ...." అభ్యర్థనగా అన్నాడు.

"సారీ అరుణ్! ఇప్పుడు నేనెక్కడికీ రాను." అనుపమ స్థిరంగా అంది. అరుణ్ మొహం వివర్ణమైంది. మౌనంగా స్కూటర్‌స్టార్ట్ చేశాడు. అనుపమ తన మాట కాదనడం అతనికి అవమానంగా ఉంది. సినిమా వదలిన జనంతో రోడ్లు రష్‌గా ఉనై. అరుణ్ మాట్లాడక పోవడంతో

అతనికి కోపం వచ్చిందని గ్రహించింది అనుపమ. వారిద్దరూ చేరువగానే ఉన్నా ఇద్దరి మధ్యా అంతులేని అగాధం....

స్కూటరు తిరగ వలసిన మలుపు రాగానే అన్యమనస్కంగా సైడివ్వకుండానే హఠాత్తుగా మలుపు తిప్పడం- అటునుంచి వేగంగా వస్తున్న లారీ స్కూటర్ని ఢీకొనడం - ముందున్న అరుణ్ ఎగిరి అంత దూరం పడడం - వెనక కూర్చున్న అనుపమ కింద పడిపోగానే లారీ చక్రం ఆమె కాలిమీదుగా వెళ్ళడం అన్నీ రెప్పపాటులో జరిగిపోయినై.

అరుణ్‌కి కాళ్ళు, చేతులు కొట్టుకుపోయినై. కొద్దిగా తలకు దెబ్బ తగిలింది. లారీ డ్రైవరు ఆగకుండానే వెళ్ళిపోయాడు. అనుపమకు అమితమైన బాధతో స్పృహ తప్పింది. ఎవరో చేయూతనిస్తే లేచి నుంచు న్నాడు అరుణ్ అనుపమను హాస్పిటల్లో చేర్చి ఇంట్లో తెలియజేయడం, రెండు మూడు రోజులకే అనుపమ ఎడమ కాలు ఆపరేషన్ చేసి తీసె య్యడం జరిగిపోయాయి.

* * *

"అనూ! బాధపడకు. నుదుట రాసిన దాన్ని ఎవరూ తప్పించ లేరు." తల్లి ఓదార్చే ప్రయత్నం చేస్తోంది, కానీ ఆమెకీ కన్నీరాగడం లేదు. రాఘవయ్య కూతురు బాధ చూడలేక తప్పించుకు తిరుగుతున్నాడు. తీసేసిన కాలు చూసి కుమిలిపోతూంది అనుపమ

"అమ్మా! అరుణ్ నన్ను చూడడానికి రాలేదుకదూ!" కాలు

పోయిన దాని కన్నా అరుణ్ రాలేదన్న బాధ ఆమెను మరింత క్రుంగ దీస్తోంది. పరిస్థితులు మామూలుగా ఉండిఉంటే పెళ్ళి జరగాల్సింది మరుసటిరోజు. తల్లి ఏదో నచ్చచెప్తుండగా వచ్చాడు అరుణ్. అతనిని చూసిన అనుపమ కళ్ళల్లో కోటికాంతులు, అంతులేని ఆనందం. కానీ అరుణ్ ఆమెని ఆస్పత్రిలో ఒక రోగిని చూసినట్లు చూశాడు. "అరుణ్" అంది ఆర్తిగా అనుపమ.

"అనూ! ఎట్లా ఉంది?" ప్రశ్నించాడు అరుణ్ "కాలు పోయింది- నా బతుకు చీకటైపోయింది- కాదు కుంటిదైపోయింది" కన్నీరు జాలు వారుతుంటే అంది అనుపమ. అరుణ్ తనను గుండెకు చేర్చుకుని ఓదా రుస్తాడనీ- అతని సన్నిధిలో సేద తీరాలన్న తపన ఆమె మాటల్లోఉంది! "నీ బతుకు చీకటి కానే కాదు అనూ! నేనున్నాను" అని అరుణ్ అంటా డని ఆశిస్తున్న అనుపమను అతని మాటలు, ప్రవర్తనాకూడా పాతాళం లోకి తోశాయి. అతని పొరపాటు వల్లే ఆమె కుంటిదైందన్న బాధ కూడా అరుణ్ మొహంలో లేశమంతైనా లేదు.

"ఏం చేస్తాం అనూ! అంతా విధిలిఖితం. అదృష్టం బాగుండి ఉంటే రేపే మన పెళ్ళి జరగాల్సిన రోజు. కానీ మనకు పెళ్ళి జరిగే యోగం లేదు...." తాపీగా అన్నాడు.

"అరుణ్!" అంది షాక్ తిన్నట్లు అనుపమ.

"ఏమిటి, అనూ! ఇంకా మన పెళ్ళి జరుగుతుందనే అను కుంటున్నావా? నీది నిజమైన ప్రేమే అయితే ఒకసారి ఆలోచించు.

కుంటిదాన్ని చేసుకొని నేనేం సుఖపడతాను? ఎక్కడికి వెళ్ళాలన్నా, ఎవరికి పరిచయం చెయ్యాలన్నా సమస్యేకదా! కాబట్టి నువ్వు నన్నింక మరచిపో. ఇంకా నువ్వు నా మీద ఆశలు పెట్టుకుంటావేమో అన్న భయంతో ముందే చెబుతున్నాను" అంటున్న అరుణ్‌ని నిర్లిప్తంగా చూసింది అనుపమ. ఆ క్షణంలో ఆమె మనసులో చెలరేగిన భావాలకు భాష లేదు.

"థ్యాంక్స్ అరుణ్! నీలా ఉండే వాళ్ళంటే నాకు చాలా ఇష్టం పెళ్ళయ్యాక డైవర్సు కంటే ఇదే నయం కదూ!" ఆవేదన హృదయాన్ని దహిస్తున్నా అనుపమ గుండె నిబ్బరంగా ఉంది. చటుక్కున ఏదో గుర్తొచ్చినట్లు "అరుణ్! నువ్వు ప్రేమ కానుకగా ఇచ్చిన ఈ ఉంగరం తీసుకెళ్ళు" అంది, చేతి నుండి ఉంగరం తీసి ఇస్తూ. ఒక క్షణం ఆలోచించి తీసుకుని వెళుతూ "వస్తా అనూ!" అన్నాడు చాలా మామూలుగా

"గుడ్‌బై అరుణ్! గుడ్‌బై ఫరెవర్" అంది. తరవాత ఒకగంట సేపు మనసు తేలికయ్యే వరకూ ఏడ్చింది. తెలిసిన విషయానికి రాఘవయ్యగారు, లక్ష్మి అనుపమ ఒకరి నొకరు ఆశ్వాసించుకోవడం తప్ప ఏం చెయ్యాలన్నది ఎవరికి తెలియలేదు. లక్ష్మి అన్నది" అమ్మాయిని చేసుకోమని అరుణ్‌ని బతిమాలుతాను" అని. కానీ అనుపమ ఏ మాత్రం ఒప్పుకోలేదు-

శూన్యంలోకి చూస్తూ పడుకున్న అనుపమ ఉలిక్కి పడింది. "అనూ" అన్న పరిచయమైన పిలుపుతో, ఎదురుగా కార్తీక్. ఆమె

మనసులోకి ఒక్కసారి వెలుగు ప్రసరించినట్లయింది- "కార్తీక్! ఈ కుంటిదాన్ని, ఈ అభాగ్యురాలిని చూడడానికి వచ్చావా?" ఆమెలో కరుడు గట్టిన బాధ కన్నీరై స్రవిస్తూనే ఉంది.

"అనూ! బాధ పడకు! అన్నీ మన చేతుల్లోనే ఉన్నై అనుకుంటాం. అందుకే ఈ బాధ. పెళ్ళి ముహూర్తం రేపే కదూ! మరి పోస్టు పోన్ చేశారా?" ఓదారుస్తూనే పెళ్ళి సంగతి అడిగాడు కార్తీక్.

"అరుణ్ ఈ కుంటిదాన్ని చేసుకోనన్నాడు." మళ్ళీ ఆమె హృదయం బద్దలైంది. కార్తీక్‌కి ఈ వార్త పిడుగుపాటులా ఉంది. "ఇదేనా న్యాయం? పెళ్ళయ్యాకే కాలుపోతే? లేకపోతే ఇదే కాలు అరుణ్‌కి యాక్సిడెంట్‌లో పోయిఉంటే?" మనసులో అనుకున్నమాటలేపైకిఅన్నాడు.

"అవన్నీ అనుకోవడమెందుకు? ఇంక నా జీవితం మోడు లాగే గడిచిపోతుంది. ఎవరో ఉసురు పెట్టిన ఫలితమిది." అనుపమ బాధగా అంది.

"అనూ! నువ్వు కార్తీక్‌ని మరచిపోయావు. నీకు నేనున్నాను అనూ! విధి ఈ విధంగానన్నా నిన్ను నాకు దక్కించిందని సంతోష పడతాను. నీకభ్యంతరం లేకపోతే నా జీవన జ్యోతిగా నా జీవితంలోకి రమ్మని ఆహ్వానిస్తున్నాను అనూ!" కార్తీక్ మాటలకు స్థాణువైంది అనుపమ. తాను వింటున్న మాట నిజమేనా? పరస్పరం ప్రేమించుకున్నామనకున్న భ్రాంతిలో ఉన్న అరుణ్ ముహూర్తాలు పెట్టుకున్నాక తిరస్కరించాడు. తనను నిజంగా ప్రేమించిన కార్తీక్ కుంటిదైనా తనే కావాలని కోరుకుంటున్నాడు, ఎంత చిత్రం!

"అనూ! ఏమిటో ఆలోచిస్తున్నావ్! నేనంటే ఇష్టంలేదా?" కార్తీక్ ప్రశ్నించాడు.

"కాదు కార్తీక్! నీలో అసలైన దైవత్వాన్ని చూస్తున్నాను- కానీ నన్ను చేసుకుని నువ్వేం సుఖపడ్తావ్? నా స్వార్థం కోసం నీ జీవితాన్ని పాడు చెయ్యడం న్యాయం కాదేమో!...."

"అనూ! నువ్వు నా జీవితంలోకి రావడం వరమనుకుంటాను, అంతకంటే ఎక్కువగా నేనేం చెప్పలేను. నువ్వు కదలడానికి డాక్టరు అనుమతిస్తే రేపటి ముహూర్తానికే మనపెళ్ళి జరుగుతుంది. లేదా తరవాత ఏ రిజిష్టార్రాఫీసులోనో...." కార్తీక్ అంటున్న ఆ తరవాత ఏమాటలూ అనుపమ చెవిని పడడం లేదు. ఆకాశమంత అతని హృదయౌన్నత్యం సాగర మంత ప్రేమ మాత్రమే అనుపమ కళ్ళముందు తేజోవంతంగా సాక్షాత్కరిస్తున్నై.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 9-4-86)